# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 16 సంచిక:176 | విజయవాడ, 25-3-2026, బుధవారం | పేజీలు: 8 | వెల: 1.00


## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బడా మోసం.. సబ్ రిజిస్ట్రార్లతో సహా పలువురిపై కేసులు

హైదరాబాద్, మార్చి 24 హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ మోసం వెలుగుచూసింది. నిజాంపేట పరిధిలో ఫ్లాట్ల విక్రయం పేరిట జరిగిన ఈ కోట్లాది రూపాయల కుంభకోణంపై సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు.

## యుద్ధంతో ఇంధన సంక్షోభం, భారత్‌పైనా ఆ ప్రభావం ఉంది: మోదీ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో పరిణామాలు, భారత్‌పై దాని ప్రభావంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభ )లో




మాట్లాడారు. పరిస్థితి ఆందోళనకరంగానే ఉందన్నారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. ఇంధన సంక్షోభాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోందన్నారు. పశ్చిమాసియాలో తలెత్తిన పరిణామాలపై లోక్‌సభలో మాట్లాడిన మరుసటి రోజే ఆయన రాజ్యసభ సభ్యులతో ఆ వివరాలను పంచుకున్నారు.

గల్ఫ్ దేశాల్లోని భారతీయులు యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్నారని ప్రధాని తెలిపారు. ఆయా దేశాల్లో కోటి మందికి పైగా భారతీయ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాల నుంచి 3.75 లక్షల మందిని సురక్షితంగా భారతదేశం తీసుకువచ్చామని చెప్పారు. భారతీయుల రక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని తెలిపారు. మన ముందు చాలా సవాళ్లు ఉన్నాయని చెప్పారు.

అర్థిక వ్యవస్థకు ఇంధనమే వెన్నెముక అని, ఇంధన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని చెప్పారు. గృహావసరాలకు సరిపడా ఎల్పీజీ సరఫరా పెంచుతున్నామని చెప్పారు. 41 దేశాల నుంచి పెట్రో ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్నామని, 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం పడిందన్నారు. 'యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు, యుద్ధం ప్రభావం పడిన దేశాలతో ప్రభుత్వం నిరంతర సంప్రదింపులు సాగిస్తోంది. శత్రుత్వం వీడి, ఉద్రిక్తతలకు తగ్గించేందుకు కృషి చేయాలని అన్ని పక్షాల వారిని భారత్ కోరుతోంది. ఇండియాపై కూడా యుద్ధం ప్రభావం ఉంది. వాణిజ్య మార్గాలపై ప్రభావం పడి రొటీన్‌గా వచ్చే పెట్రోల్, డీజిల్, ఎరువలపై ప్రభావం పడుతోంది. అయితే వీటి సరఫరాకు అవాంతరాలు తలెత్తకుండా ఇండియా అన్ని ప్రయాత్నాలు చేస్తోంది' అని వివరించారు. ఈ దశలో పెద్దల సభ ఏకగ్రీవంగా శాంతి, చర్చల సందేశాన్ని ఇవ్వడం ముఖ్యమని పేర్కొన్నారు.

## పారిశ్రామిక రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ది చారిత్రాత్మక ఘట్టం:రామ్మోహన్



అనకాపల్లి, మార్చి 24 అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ) వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## విదేశీ నిధుల అంశం.. అనంతపురం ఆర్డీటీకి కేంద్రం క్లియరెన్స్

అనంతపురం: అనంతపురం జిల్లా వాసులకు కేంద్రం శుభవార్త చెప్పింది. విదేశీ నిధులు పొందేందుకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) (కు కేంద్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇచ్చింది.

ఆర్డీటీ సంస్థ అనంతపురం జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి విదేశాలనుంచి




వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) కింద నిలిపివేస్తూ ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆ సంస్థ ఎఫ్‌సీ (ఫారిన్ కాంట్రిబ్యూషన్) ఖాతాల్లో ఉన్న నిధులను వినియోగించడానికి ఆటంకం ఏర్పడింది. ఫలితంగా ఈ సంస్థ చేపడుతున్న విద్య, వైద్యం, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలుకు అంతరాయం కలిగింది. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎంపీలు దీన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఎఫ్‌సీఆర్ఏను కేంద్రం రెన్యువల్ చేసింది.

మోదీ, అమిత్‌షాకు చంద్రబాబు ధన్యవాదాలు

పేదల కోసం దశాబ్దాలుగా అద్భుత సేవలు అందిస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధుల అంశంలో ఉన్న సమస్య పరిష్కరించిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాకు ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాల్లో వివిధ రకాల సేవలను ఆర్డీటీ అందిస్తోందని చెప్పారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద స్వచ్ఛంద సంస్థలకు విదేశాల నుంచి వస్తున్న నిధులను నిలిపివేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయంతో సంస్థ సేవలకు అంతరాయం కలిగిందన్నారు. సంస్థ అందిస్తున్న సేవలను వివరించి, ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర హోం మంత్రికి విజ్ఞప్తి చేయగా.. ఆయన చూపిన ప్రత్యేక చొరవతో నేడు అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి.. ఈ ట్రస్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న లక్షలాది మంది పేద ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీఎం పేర్కొన్నారు.

ప్రజల జీవితాల్లో భాగమైన ఆర్డీటీ సేవలు నిరంతరాయంగా అందేలా చూస్తానని గతంలో మాటిచ్చానని మంత్రి నారా లోకేశ్ గుర్తుచేశారు. సమస్యపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామని.. దశాబ్దాలుగా ఆర్డీటీ చేస్తున్న సేవలను వివరించానని తెలిపారు. ఇప్పుడు అడ్డంకులన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీటీ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌కు ఆయన అభినందనలు చెప్పారు.

## విజయవాడలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం.. ఐసిస్ నెట్‌వర్క్ గుట్టురట్టు




విజయవాడ, మార్చి 24 : విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్టుతో దేశవ్యాప్త ఉగ్రవాద నెట్‌వర్క్ గుట్టురట్టయింది. ఇది కేవలం స్థానిక అంశం మాత్రమే కాక, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న భద్రతాపరమైన విషయమని పోలీసులు గుర్తించారు. విజయవాడ వంటి ప్రశాంతమైన నగరంలో ఇలాంటి నెట్‌వర్క్ బయటపడటం భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం 42 మంది సభ్యుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. విజయవాడలో పట్టుబడిన ముగ్గురు యువకులను విచారించగా, వారు సామాన్య నేరస్థులు కాదని, దేశవ్యాప్త, అంతర్జాతీయ ఉగ్రవాద సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నారని తేలింది. వీరి వెనుక ఉన్న భారీ నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఏడు రాష్ట్రాల్లో పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశంలోని 7 రాష్ట్రాలు(ఢిల్లీ, రాజస్థాన్, బీహార్, తెలంగాణ) వంటి ప్రాంతాలకు చెందిన సుమారు 42 మంది యువకులతో ఒక రహస్య సోషల్ మీడియా గ్రూప్ నడుస్తోంది. ఈ గ్రూప్ ద్వారా ఐసిస్ (xూxూ), కిలాఫత్ ఐడియాలజీని వ్యాప్తి చేస్తున్నారు. వీరంతా ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నారు. భారతదేశాన్ని ఇస్లామిక్ స్టేట్‌గా మార్చాలనేది వీరి ప్రధాన సంభాషణల సారాంశమని పోలీసులు గుర్తించారు. జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను పెట్టి ఫొటోలు దిగడం వీరి తీవ్రవాద ధోరణికి నిదర్శనమని పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ సంబంధాలు, శిక్షణ..

పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ఉన్న ఉగ్రవాద సంస్థలతో వీరు నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నారు. భారతీయ యువతను జిహాదీ వైపు మళ్లించి, శిక్షణ కోసం విదేశాలకు పంపేందుకు ఈ ముగ్గురు యువకులు ప్రోత్సహిస్తున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లలో కీలకమైన ఆడియో క్లిప్పింగ్‌లు, జిహాదీ మెసేజ్‌లు లభించాయి.

పోలీసుల హెచ్చరిక..

ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏపీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపాయి. దేశ భద్రతకు విఘాతం కలిగించే ఇలాంటి మిలిటెంట్ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. యువత సోషల్ మీడియాలో ఏయే గ్రూపుల్లో ఉంటున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, పిల్లలు ఉగ్రవాదం వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని పోలీసులు కోరారు.

## నియోజకవర్గాల పునర్విభజనతో మరిన్ని అవకాశాలు: పవన్ కల్యాణ్




విజయవాడ: నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు శుభవార్త.. ఆర్డీటీ సేవలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

అమరావతి, మార్చి 24 తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి. అనంతపురం జిల్లా సామాజిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ (=ఋ) సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. విదేశీ నిధుల సేకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం మార్చి 22, 2031 వరకు పొడిగిస్తూ అధికారికంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

# రణవీర్ సింగ్ విశ్వరూపం.. రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత




రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్ 2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ (Sacnilk) రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

## సినిమా

## చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

# ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించినట్లు సమాచారం.

## ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

# ఏప్రిల్ నుంచి మెగా 158 షూటింగ్!



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నట్టు తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

## విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

# ఆమెను చూసేందుకు ఎగబడ్డ ఫ్యాన్స్



విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి.హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

# డార్లింగ్ రీ రిలీజ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సూపర్ హిట్ చిత్రం డార్లింగ్. ప్రస్తుతం ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు ఆయనకు డార్లింగ్ అనే ట్యాగ్ తెచ్చిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ఇప్పుడు రీరిలీజ్ రూపంలో తిరిగి థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమా ఏప్రిల్ 23న గ్రాండ్‌గా మళ్లీ విడుదల కానుంది. 2010లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ప్రభాస్ నటన, స్టైలిష్ లుక్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా తర్వాతే ఆయనకు డార్లింగ్ అనే పేరుతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.

# గ్లామర్ టచ్

ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా వెలిగిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్.. షార్ట్‌టైంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ లుక్స్ తోపాటు.. నటనతో ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అందం, అభినయంతో తెలుగు, తమిళ్, హిందీ అంటూ భాషతో సం బం ధం లేకుండా పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని పెండ్లి చేసుకుని బాలీవుడ్ లోనే సెటిల్ అయిపోయింది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్‌మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా మరోసారి అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీబ్రా అవుట్ ఫిట్ లో మెస్మరైజ్‌చేసింది. వైట్ అండ్‌బ్లాక్‌చెక్స్‌డ్రెస్‌తో గ్లామర్ టచ్ ఇచ్చింది. రకుల్ షేర్‌చేసిన ఈ పిక్స్‌ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఇటీవలే హిందీలో 'దేదే ప్యార్‌దే 2'తో అలరించిన రకుల్.. లేటెస్టుగా 'మేరీ పత్నీ కా రీమేక్' ప్రాజెక్టులో బిజీగా ఉంది.



# సో స్పెషల్



'ది రాజా సాబ్' మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో గ్లామర్ షోతో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం సర్దార్ 2 షూటింగులో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మాళవిక మోహన్ తరచుగా గ్లామరస్ ఫొటోస్‌షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఓ ఈవెంట్‌లో ర్యాంప్‌వాక్‌తో అదరగొట్టింది. ఈసందర్భంగా మాళవిక ఇన్‌స్టా వేదికగా పిక్స్ లను ప్రేక్షకులతో పంచుకుంటూ ఇంట్రెస్టింగ్‌పోస్ట్‌చేసింది. 'నాకు ర్యాంప్‌వాక్ అంటే చాలా ఇష్టం. ఈ అద్భుతమైన లుక్‌ను రూపొందించిన నా టీమ్‌కు థాంక్స్. నటులుగా మనం క్యారెక్టర్‌లోకి ఒదిగిపోవడం, వేరేలా రెడీ కావడం అలవాటు. కానీ డైరెక్టుగా ఆడియన్స్ ముందుకు వెళ్లే ఆ అనుభూతి మాత్రం సో స్పెషల్. ముఖ్యంగా ఎంతో సరదాగా ఉంటుంది' అంటూ పేర్కొంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published at D.No. 42-4-61/A2,Bhavani Residency,FFB,2nd Lane , Ramarajuvari veedi, Ramakrishnapuram, Vijayawada - 520011, Andhra Pradesh,Printed at Sri Muktheswara Publications, D.No. 29-23-11, Thadepalli Vari Veedi, Surya Rao Peta, Vijayawada - 520002, Andhra Pradesh. Fax: 040-24054446, Cell:9440265569
Email: bharathasakti@gmail.com, RNI APTEL/2010/36743, Editor: Kesaram Penta Reddy